ఇక హైడ్రా మాన్‌సూన్ యాక్షన్ టీమ్‌లు సిద్ధం

రీజనల్ ఫైర్ ఆఫీసర్ నేతృత్వంలో వరద సహాయక చర్యలు

- సహకారం అందజేయనున్న జీహెచ్‌ఎంసీ
- జోనల్ కమిషనర్ హేమంత్ వాసుదేవరావు పర్యవేక్షణ


జలమయమైన లింగంపల్లి-గచ్చిబౌలి మెయిన్ రోడ్డు (ఫైల్)

గచ్చిబౌలి: వరద వచ్చినప్పుడు జీహెచ్‌ఎంసీ యాక్షన్ టీమ్‌లు పని చేయడం చూశాం. ఇక నుంచి వరద సహాయక చర్యలు చేపట్టేందుకు హైడ్రా మాన్‌సూన్ యాక్షన్ టీమ్‌లను సిద్ధం చేశారు. రోడ్లపై వరద నీరు చేరినా, చెట్లు విరిగి పడినా, నాలాలు పొంగినా, అపార్ట్‌మెంట్లు , ఇళ్లలోకి వరద నీరు చేరినా హైడ్రా మాన్‌సూన్ యాక్షన్ టీమ్ రంగంలోకి దిగుతుంది. ఈ టీమ్‌కు రీజనల్ ఫైర్ ఆఫీసర్ జయప్రకాష్ నేతృత్వం వహిస్తారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ వాసుదేవ రావు పర్యవేక్షణలో టీమ్ పని చేస్తుంది. జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లు, సిబ్బంది పూర్తి సహకారం అందిస్తుంది. ఇటీవలే జడ్సీ ఆధ్వర్యంలో ఆయా విభాగాల అధికారులు సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు హైడ్రా టీమ్‌లకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.

డీఆర్‌ఎఫ్ టీమ్‌లు..

శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో ఆయా ప్రాంతాలలో డీఆర్‌ఎఫ్ బృందాలు 24 గంటలు అందుబాటులో ఉంటాయి.

- యూసుఫ్‌గూడ డీసీ, జకియా సుల్తానా, ఈఈ రాజ్ కుమార్, శేరిలింగంపల్లి డీసీ ప్రశాంతి, ఈఈ కిష్టప్ప, చందానగర్ డీసీ మోహన్ రెడ్డి, ఈఈ ఇందిరాబాయ్, ఆర్సీపురం పటాన్‌చెరు డీసీ సురేష్, ఈఈ సురేష్‌లు యాక్షన్ టీమ్‌లో కీలక బాధ్యతలు నిర్వహించనున్నారు. రీజనల్ ఫైర్ ఆఫీసర్ జయప్రకాష్ నేతృత్వంలో బృందాలు పని చేస్తాయి.


చందానగర్‌లో సెల్లార్‌లో చేరిన వరద నీటిని ట్రాక్టర్లతో తోడుతున్న దృశ్యం(ఫైల్)

- సర్కిల్-19 యూసుఫ్‌గూడ : 6309062588
- సర్కిల్-20 శేరిలింగంపల్లిలో గచ్చిబౌలి స్టేడియం : 9154069163, దుర్గం చెరువు: 8712406830, గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్: 8712406849, శిల్పారామం: 9154069168, చందానగర్ సర్కిల్.. 8712406829,
- సర్కిల్-22 ఆర్సీపురం ..పటాన్‌చెరు పరిధిలో బీహెచ్‌ఈఎల్- 8121041396 ఫోన్ నంబర్లలో టీమ్‌లు అందుబాటులో ఉంటాయి.
- యూసుఫ్‌గూడ- దుర్గాప్రసాద్ 6302137885
- శేరిలింగంపల్లి- రాజేశ్వర్‌రావు: 7013227371
- చందానగర్- వెంకటేశ్వర్లు : 7606833322
- ఆర్సీపురం .. పటాన్‌చెరు మురళీకృష్ణ : 7330484570లను మార్షల్స్‌గా నియమించారు


లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరదనీరు (ఫైల్)

వాటర్ లాగింగ్ పాయింట్లు ఇవే..

- శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని ఆయా సర్కిళ్లలో భారీ వర్షం వస్తే వాటర్ స్టాగినేషన్ పాయింట్ల వద్ద భారీగా నీరు చేరే అవకాశం ఉంది.
- గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్ ముందు, డీఎల్‌ఎఫ్, బయోడైవర్సిటీ జంక్షన్, అంజయ్య నగర్, ఖాజాగూడ, రాయదుర్గం లిడ్‌క్యాప్ సమీపంలో, డీఎల్‌ఎఫ్, జయభేరీ, ట్రిపుల్ ఐటీ, జోనల్ కార్యాలయం ఎదురుగా లింక్ రోడ్డు మాదాపూర్ ఫేజ్-2, నెక్టార్ గార్డెన్, మాదాపూర్ మెయిన్‌రోడ్డు, శిల్పారామం, కొత్తగూడ జంక్షన్, కొండాపూర్ ఆర్టీఓ ఆఫీస్ ఎదురుగా, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి, పాపిరెడ్డినగర్ కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జి, దీప్తిశ్రీనగర్, మదీనాగూడ, మియాపూర్ సమీపంలోని జూబ్లీహిల్స్ లింకురోడ్డు తదితర చోట్ల వరద నీరు చేరుతున్నట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు గుర్తించారు. కొద్దిరోజుల క్రితం కురిసిన భారీ వర్షం చందానగర్ సర్కిల్‌ను అతలాకుతలం చేసింది. పదుల సంఖ్యలో అపార్ట్‌మెంట్ల సెల్లార్లలోకి వరద నీరు చేరింది. బీహెచ్‌ఈఎల్ ఫ్లైఓవర్ వద్ద సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో గతంలో ఎన్నడు లేని విధంగా చందానగర్‌లోని సెల్లార్లలోకి వరద నీరు చేరింది.


దోయన్స్ కాలనీ వద్ద పెట్రోల్ బంకులో..

పుణ్యక్షేత్రాలకు డీలక్స్ బస్సులు

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్ -2 డిపో పరిధిలో తెలంగాణ రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలకు ప్రతి శని, ఆదివారాల్లో డీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. గూడంగుట్ట సత్యనారాయణస్వామి ఆలయం, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొండగట్టు హనుమాన్ ఆలయం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వరిస్వామి ఆలయాలకు డీలక్స్ బస్సులు ప్రత్యేకంగా నడుపుతున్నామని తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 5 గంటలకు డిపో నుండి బయల్దేరి రాత్రి 11 గంటలకు మియాపూర్‌కు వస్తాయని తెలిపారు. 30 మందికి పైగా భక్తులు ఉంటే ఏరోజైనా ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. వివరాలకు 9059162162,9959226420 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

గుంతలరోడ్డు.. ఇబ్బందులు


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో భారీ గుంత

మియాపూర్: మియాపూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో ఏర్పడ్డ గుంతలు ప్రమాదకరంగా మారాయి. విశ్వేశ్వర కాలనీ వద్ద మ్యాన్‌హోల్ సమీపంలో రోడ్డు కుంగిపోవడంతో భారీ గుంత పడింది. దీంతో ఆ రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడే అవకాశముందని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి


అవగాహన కల్పిస్తున్న పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పాటుపడాలని పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి అన్నారు.ఆదివారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం వికాస్ అసోసియేషన్ సభ్యులకు యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సే నో టు డ్రగ్స్ అనే నినాదం ప్రతి ఒక్కరికి చేరేలా చూడాలి'' అని పిలుపునిచ్చారు. డ్రగ్స్ ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయన్నారు. అనంతరం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి, కానిస్టేబుల్‌లు, ప్లాట్‌ఓనర్స్ పాల్గొన్నారు.

'యోగా పోటీల్లో జేఎన్‌వి విద్యార్థిని అమూల్య ప్రతిభ

రాయదుర్గం: యోగా జాతీయస్థాయి పోటీలలో జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా విద్యార్థిని సత్తా చాటింది. ఇటీవల కోల్‌కతాలో నిర్వహించిన ఆలిండియా నేషనల్ యోగా మీట్-2025లో తెలంగాణ రాష్ట్రం తరపున జేఎన్‌వి రంగారెడ్డి జిల్లా విద్యార్థిని అమూల్య ప్రతిభ చాటింది. నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ విద్యార్థిని అమూల్యకు సర్టిఫికెట్ అందించి అభినందించారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని జయశంకర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని, కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, జయశంకర్‌కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గాంధీని కలిసిన జయశంకర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: ప్రశాంత్‌హిల్స్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంత్‌హిల్స్‌కాలనీ, ఎంజేఆర్ దాబా ప్రాంతంలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మియాపూర్‌లో..

మియాపూర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కృషినగర్, ప్రశాంత్‌నగర్, ఎంఏనగర్, రాఘవేంద్ర మిత్రా అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్: వేమనకాలనీ, చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- శంకర్‌నగర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ..మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు గౌతమీనగర్, వార్డు కార్యాలయం, బజాజ్ ఎలక్ట్రానిక్స్, శిల్పా ఎన్‌క్లేవ్ ఏరియాలలో ..
- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జవహర్ కాలనీ రోడ్డు నెంబర్ 4,5,6, కైలాష్‌నగర్, ఎస్వీఎస్ ఇన్‌ఫ్రా లిమిటెడ్, భిక్షపతి ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో ..
- శ్రీరాంనగర్ ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు శ్రీరాంనగర్, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, కినార గ్రాండ్ హోటల్, గంగారం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 25, పచ్చిమిర్చి 60 , బెండ 40, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 60, బీన్స్ 80, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 20, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

25న శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధి శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు రోడ్డు విస్తరణ పనులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం నాయకులు రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.45 కోట్లతో నూతనంగా రోడ్డును విస్తరించనున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతిరెడ్డి, నాగిరెడ్డి, మహిపాల్, ప్రసాద్, సందీప్‌రెడ్డి, కాలనీల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఉచిత దంత వైద్యశిబిరం

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ కమ్యూనిటీహాల్‌లో షేరేణి స్మైల్స్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వినీత్ రెడ్డి మాట్లాడుతూ రోజు ఉదయం, సాయంత్రం దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ఆహారం తీసుకున్న వెంటనే నీటితో పుక్కిలించాలన్నారు. దంత సమస్యలు ఉన్నవారు అశ్రద్ధ చేయకుండా వెంటనే దంత వైద్యులను సంప్రదించాలన్నారు. శిబిరంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీర్ ఎన్‌క్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయులు, నాయకులు శంకర్‌రెడ్డి, శివప్రసాద్, కోటేశ్వరరావు, లక్ష్మణ్‌రావు, సురేష్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, వెంకటేశ్వరరాజు, నరాల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో పరీక్ష చేస్తున్న వైద్యులు

మెరిడియన్ పాఠశాల వార్షికోత్సవం


వేడుకలలో పాల్గొన్న విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు బుట్టారేణుక

మాదాపూర్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని మాజీ ఎంపీ, మెరీడియన్ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు బుట్టా రేణుక అన్నారు. మాదాపూర్ మెరిడియన్ స్కూల్ 19వ వార్షికోత్సవ వేడుకలను పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాల విద్యార్థులను నాయకులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. 19 రకాల ఔషధ మొక్కలను నాటారు. శిఖర థీమ్‌తో మొదలైన కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత నీలకంఠ బుట్టా, స్కూల్ ప్రిన్సిపల్ కరణం భవాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనిల్‌గౌడ్ జన్మదిన వేడుకలు

రాయదుర్గం: బీజేపీ జిల్లా కార్యదర్శి మూల అనిల్‌గౌడ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ రవికుమార్ యాదవ్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ రాఘవేంద్రరావులు అనిల్‌గౌడ్‌ను అభినందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బీజేవైఎం గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు నక్కా శివకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్, సీనియర్ నాయకులు వరలక్ష్మీ, ధీరజ్, నరేందర్ ముదిరాజ్, మీన్‌లాల్‌సింగ్, వసంత్‌కుమార్ యాదవ్, నరేందర్ గౌడ్, అంబటి అశోక్, శ్యామ్ యాదవ్, సతీష్‌గౌడ్, సాయి, అమర్‌నాథ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న అనిల్‌గౌడ్, రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

ప్రణాళికాబద్ధంగా డివిజన్ల అభివృద్ధి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రతీ కాలనీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీ, అంబేడ్కర్ కాలనీ, బండ్లగూడ కాలనీలలో కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు అఫ్జల్, వెంకటేష్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ డీజీఎం శివకృష్ణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగదానందకారక..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నృత్యదీక్షలయ గురువు లక్ష్మీశంకర్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో జగదానందకారక, జతిస్వరం, గీతరసికే, మండూక శబ్దం, అప్సరసలు, నమశ్శివాయతే, వందే మీనాక్షి, రామాయణ శబ్దం, పరమ పురుషుడు, మంగళం తదితర అంశాలను కళాకారులు ఆద్య, ఆశ్రిత, అమృత, అవంతిక, అవిజ్ఞా, గాయత్రి, వెంకట్, జీవిత, కార్తీక, నందిని, పూర్విక, రితిక తదితరులు ప్రదర్శించారు.

బీజేపీ గచ్చిబౌలి డివిజన్ నూతన కార్యవర్గం



రాయదుర్గం: బీజేపీ గచ్చిబౌలి డివిజన్ నూతన కార్యవర్గాన్ని డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ ఆదివారం ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి నియామకపత్రాలను అందించారు. డివిజన్ ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్‌రెడ్డి, కిషన్‌గౌలి, నరేందర్ యాదవ్ సతీష్‌గౌడ్, శ్యామ్‌లెట్ సంజీవ, దుర్గారామ్, ప్రధాన కార్యదర్శులు బబ్లూసింగ్, సురేందర్‌ముదిరాజ్, కార్యదర్శి దినేష్‌యాదవ్, రంజిత్ పూరి, కోశాధికారి ఉమేష్‌గౌడ్ నియమితులయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఉద్దేశించి రవికుమార్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ అందరూ కలసి కట్టుగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మీన్‌లాల్‌సింగ్, వసంతకుమార్ యాదవ్, రవీందర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

యువత బీజేపీలో చేరిక

గచ్చిబౌలి: మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో మాదాపూర్ డివిజన్ సుభాష్‌చంద్రబోస్ నగర్, కృష్ణ కాలనీ నుంచి 50 మంది యువకులు పార్టీ సీనియర్ నాయకుడు రాధాకృష్ణయాదవ్ బీజేవైఎం నాయకుడు రాముయాదవ్ నాయకత్వంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ బీజేపీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరన్నారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, కన్వీనర్ రాఘవేంద్రరావు పార్టీలో చేరిన వారిని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు విక్కీ, స్వామి, గోవర్ధన్‌రెడ్డి, వసంత్, మధు, అరుణ్, అరవింద్, చందు, కార్తీక్, సాయి, శివ శంకర్, సిద్ధు, మోహన్ పాల్గొన్నారు.

ఇది పార్కేనా..?

ఎటు చూసినా చెత్తాచెదారం, వ్యర్థాలే..

- నడవడానికి వీలులేని వాకింగ్‌ట్రాక్
- తుప్పుపట్టిన ఆటవస్తువులు


లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీ పార్కు దుస్థితి

శేరిలింగంపల్లి: జీహెచ్‌ఎంసీ పార్కు నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా తయారైంది. గచ్చిబౌలి డివిజన్‌లోని లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీలో నారాయణ జూనియర్ కళాశాల పక్కనే జీహెచ్‌ఎంసీ పార్కును ఏర్పాటు చేసింది. ఐతే ఈ పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీ పార్కులో వాకింగ్ ట్రాక్‌లపై చెత్త, వ్యర్థాలు, గడ్డితో నిండిపోయింది.



- పాములు సంచారంతో కాలనీవాసులు పార్కులోకి రావాలంటే జంకుతున్నారు. దీంతో ఇటు వైపు వచ్చేవారు కరువయ్యారు.
- పార్కులో చెత్తాచెదారం, ఎండిన ఆకులు, వ్యర్థాలతో నిండిపోయింది.
- గాలి,వానకు చెట్ల కొమ్మలు విరిగిపడగా వాటిని అలాగే వదిలేశారు.
- పార్కులో చిన్నపిల్లల ఆటవస్తువులు తుప్పుపట్టిపోయాయి
- పార్కు ప్రహరీ ధ్వంసం అయింది. పార్కు మొత్తం గడ్డితో నిండిపోయింది. లైటింగ్ సౌకర్యం లేకపోవడంతో సాయంత్రం 6 దాటితే ఆ ప్రాంతం ఖాళీగా ఉంటుంది.
- అధికారులు పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ధ్వంసమైన బెంచీ




పార్కులోని వాకింగ్ ట్రాక్‌లో చెత్త, చెట్ల కొమ్మలు